www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 డిసెంబర్ 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కొత్తపేట
ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని రావుల పాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ సూచించారు. శనివారం వాడపల్లి, కొత్తపేటల్లో ఎస్ఐలు ఎస్.రాము, జి.సురేంద్ర తో కలిసి ఆయన వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే రూ.1000 జరిమానా కట్టాల్సి ఉంటుందని అన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై వస్తున్న యాత్రికులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఇకపై హెల్మెట్ ధరించకపోతే అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేయించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఉపాధి హామీపై కేంద్రం కుట్ర

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా



అమలాపురంలో ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం
మహాత్మా గాంధీ జాయతీ ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని జి రామ్ జి అనే చేర్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం అమలాపురం పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు, కెవిపిఎస్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని ఎలా నిర్వీర్యం చేయాలనే ఆలోచిస్తూ ఉందని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడమే పనిగా పెట్టుకుని ప్రతి బడ్జెట్ నందు నిధుల కోత పెడుతోందన్నారు. నేడు మహాత్మా గాంధీ పేరును తొలగించి జి రామ్‌జి అని చేర్చి మతపు రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 2005 చట్టం ప్రకారం వ్యవసాయం పనులు లేని రోజుల్లో ఏడాదిలో వంద రోజులు ఎప్పుడైనా పని పొందే హక్కు ఉందన్నారు. అది లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో 90 శాతం నిధులు కేంద్రం, 10 శాతం నిదులు రాష్ట్రం భరించేదన్నారు. ప్రస్తుత మార్పు వల్ల 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం మార్పుచేశారన్నారు. దీని వల్ల రూ.2800 కోట్లు రాష్ట్రం మీద భారం పడుతుందన్నారు. 125 రోజులకు పని పెంచినట్లు కేంద్రం చెబుతున్నా అందకు తగ్గ నిధులు కేటాయించలేదన్నారు. గ్రామీణ పేదలకు వలసల నివారణకు ఎంతగానో ఉపయోగపడిన ఈ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే నిర్వీర్యం చేస్తోందన్నారు. అందులో భాగంగానే పేరుమార్పుతో పాటు అనేక వ్యతిరేక మార్పులను తెచ్చిందని వారు దుయ్యబట్టారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో మరింత ఉధృతంగా కేంద్రం మీద ఒత్తిడి తెస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, కారుపల్లి గోపాలం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జి.దైవకృప, అంగన్‌వాడీ జిల్లా కోశాధికారి పి.అమూల్య, ఆశా వర్కర్ల నాయకురాలు బి.ఈశ్వరి, ఎస్ఎఫ్ఐ నాయకుడు కె.శంకర్, సిఐటియు నాయకులు డి.విశ్వనాథం, ఎం.నరేష్, ఎస్.ఫణిబాబు తదితరులు పాల్గొన్నారు.



గోడిలంకలో ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

గోడిలంకలో సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన

గ్రామీణ పేదలకు జీవన విధానాన్ని పూర్తిగా మార్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లును నిరసిస్తూ సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో అల్లవరం మండలం గోడిలంక లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎండగట్టారు. కేంద్ర ం కొత్తగా తీసువచ్చిన బిల్లు ద్వారా ఎపికి రూ.5000 వేల కోట్ల నిధులు తగ్గి, పథకం అటకెక్కే ప్రమాదం ఉందని అన్నారు. సిఎం చంద్రబాబు పేదలకు నిధులు, సంక్షేమ పథకాల కోత విధించాలని చూస్తారని అన్నారు. ఈ వంకతో రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడాన్ని ముందుకురారని దీంతో ఉపాధి కూలీలు నష్టపోతారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజావ్యతిరేకమైన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నియం త్రణ పోకడలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, సాపే రమేష్, గోడిలంక గ్రామ ప్రజలు, వ్యవసాయ కార్మిక సంఘ ప్రతినిధులు కుంచే చంద్రరావు, గోసంగి పుల్లయ్య, కాశి పుల్లయ్య, రొక్కల మూర్తి, శెట్టి బత్తుల శ్రీనివాసరావు, కొనుకు జ్యోతి, బల్లగీత, బొమ్మి రాజే ప్రియాంక, బొమ్మి భవాని, పెనుమాల దయామణి, చెల్లె ప్రమీలారాని, పెనుమాల వరలక్ష్మి, కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొని తమ నిరసన తెలిపారు.

వంతెనపై సాంకేతిక బృందం తనిఖీ


జొన్నాడ వద్ద వంతెన గడ్డర్ తనిఖీ చేస్తున్న బృందం

ప్రజాశక్తి - ఆలమూరు
జాతీయ రహదారిలో 216ఎలో గౌతమి నదిపై మండలంలోని జొన్నాడ- రావులపాలెం మధ్యగల కొత్త, పాత వంతెనల గడ్డర్స్ పనితీరును శనివారం సాంకేతిక బృందం తనిఖీలు చేసింది. ప్రతి ఏటా ఈ తనిఖీలు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ప్రత్యేక యంత్రాల సాయంతో వంతె నల అడుగుభాగానికి వెళ్లి పిల్లర్స్‌పై అమర్చిన గడ్డర్స్ పనితీరును తనిఖీ చేశారు. వాహనాలు ప్రయాణించే సమయంలో వీటి కదలికలు ఎలా ఉన్నాయన్నది గుర్తిస్తారు. ఎక్కడైనా లోపాలుంటే వాటిని మరమ్మ తులు చేయడానికి ఈ తనిఖీలు దోహదపడతాయి. అందుకనే సాంకేతిక బృందం ప్రతి ఫిల్లర్ వద్ద అడుగుభాగానికి వెళ్లి ఈ గడ్డర్స్ పని తీరును పరిశీలించారు. వాటి కదలికలను ఫొటోలు, వీడియో లను బృందం చిత్రీకరించింది. ఈ తనిఖీల వివరా లను జాతీయ రహదారుల అథారి టీకి నివేది క ఇస్తామని వాటి ఆధారంగా నిర్వహణ చేపడతారని ఆ బృంద ప్రతినిధులు పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఇలా వం తెనలు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

పండగల నేపథ్యంలో ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు
రాబోయే పండగల నేపథ్యంలో అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ముందస్తు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా రికార్డులను పరిశీలించి, జరిగిన కేసులపై సిబ్బందిని ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులకు లా అండ్ ఆర్డర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూ, రికార్డులు పారదర్శకంగా ఉండాలన్నారు. పండగల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సిబ్బంది విధుల్లో పారదర్శకంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో అల్లర్లకు ఎటువంటి అవకాశం ఇవ్వ కూడదని సిబ్బందికి వివరించారు. అలాగే అసాంఘిక శక్తులైన అనుమానితులను ముందస్తుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాంటివారిని విచ్చలవిడిగా వదిలేస్తే పల్లెల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ జి.నరేష్, ఎఎస్ఐ సూర్యచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

మోడరన్ డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - రామచంద్రపురం
పట్టణం లయన్ జివి.రావు మోడరన్ డిగ్రీ కాలేజీలో శనివారం ఐబిఎం స్కిల్‌బోర్డు, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రైనర్ టి.శివ శేషు డిగ్రీ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ జి.మాణిక్యం మాట్లా డుతూ విద్యార్థులు సాంకేతికపరిజ్ఞానం పెం పొందించు కోవాలనే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో యువత వివిధ నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ డాక్టర్ జివి.రావు మాట్లాడుతూ కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించాలని లక్ష్యంతో ఈ తరహా సెమినార్లు వర్క్ షాప్ లు నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌ల వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ వర్క్‌షాప్ తమకు ఎంతగానో ఉపకరించిందని ఈసందర్భంగా విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


అంధకారంలో ఉన్న గాంధీనగర్

వెలగని వీధి లైట్లతో ఇక్కట్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం
మండలంలోని తోటపేట గ్రామంలో గల గాంధీ నగర్ దళితవాడలో రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో గ్రామస్తులు రాత్రి సమయంలో ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. గాంధీ నగర్ నుంచి మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే చీకట్లో ప్రయాణించవలసి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో కుక్కలు, పాముల సంచారం, దారి కనపడక పలు ప్రమాదాలకు గురవుతున్నామన్నారు. రెండు నెలలుగా గ్రామపంచాయతీ అధికారులకు ప్రజాప్రతి నిధులకు వీధది లైట్లు వెలగటం లేదని చెప్పినా ఎటు వంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి మణికంఠను వివరణ కోరగా విద్యుత్తు లైట్లు వెలగడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే సిబ్బంది కొరత వల్ల లైట్లు వేయడం ఆలస్యమైం దన్నారు. వీలైనంత త్వరగా గ్రామంలో విద్యుత్ లైట్లు పునరుద్ధరించి సమస్యలు పరిష్కరించాలని గాంధీనగర్ దళిత వాడ ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర


రామచంద్రపురంలో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం
జిల్లా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు పలు అంశాలపై అవగాహక కల్పించారు.
రామచంద్రపురం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని ప్రతి పౌరుడు బాధ్యతగా నిర్వర్తించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలో శనివారం బ్రాడీపేటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. పల్లెలు, పట్టణాలు, నగరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యకమంలో కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం,వ ఋన్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ రాజు, కంచుమర్తి బాబురావు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్ తదితరులు పాల్గొన్నారు. **మండపేట, కపిలేశ్వరపురం:** పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం మండపేట మున్సిపాలిటీ వద్ద స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘం కమిషనర్ టివి.రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. అనంతరం కలువపువ్వు సెంటర్‌లో మానవహారం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, వైస్ ఛైర్మన్ పిల్లి గణేష్, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇబ్రహీం, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, డి ఇ కింతాడ శ్రీనివాస్, నాయకలు తదితరులు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని వల్లూరు ప్రాథమిక పాఠశాలలో వ్యక్తిగత పరిశు భ్రతపై శనివారం విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి నుంచే ముస్తాబు కార్యక్రమాన్ని పాఠశాలలో ప్రారంభించారు. ఇందులో భాగంగా ముస్తాబు కార్నర్‌లో సబ్బు, దువ్వెన, అద్దం, పౌడర్, తువ్వాలు తదితర సామగ్రిని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ముస్తాబై వెళ్లేలా ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. చిన్నారులచే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో పై ర్యాలీ నిర్వహించి విద్యార్థు లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిట్టూరి వెంకట శ్రీధర్, ఉపాధ్యాయ సిబ్బంది,ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆలమూరు:** పల్లెలు పరిశుభ్రతను సాధించాలంటే ప్లాస్టిక్ రహిత సమాజానికి మనందరం కట్టుబడి బాధ్యతగా పనిచేద్దామని ఎంపిడిఒ ఎ.రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రం లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ముందుగా ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ నివాసాల నుండి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను కేవలం చెత్తగా చూడకుండా, వాటిని ఉపయోగకరమైన వనరులుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపి ఆదాయం పొందే దిశగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి లావణ్య కుమార్ రాజా, ఉపసర్పంచ్ చల్లా లక్ష్మీ భూషణం, కార్యదర్శి కె.మోక్షంజలి, ఆశాలు, అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలల్లో విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిగించే నూతన కార్యక్రమం 'ముస్తాబు' ను శనివారం చింతలూరు ఎంపిపి పాఠశాల నందు నిర్వహించారు. ఎంఇఒ బి.అప్పాజీ మాట్లాడుతూ శుభ్రతే ఆరోగ్యం- ఆరోగ్యమే అభివద్ధి అనే నినాదంతో ప్రభుత్వం 'ముస్తాబు' కార్యక్రమాన్ని పాఠశాలల్లో ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వుడతా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు వాసా దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. **రావులపాలెం:** మండల పరిధి ఈతకోటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆయన గ్రామంలో పర్యటించి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరిస్తున్నారా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ముస్తాబు కార్నర్లను పరిశీలించారు. ఎంఎల్‌ఎ విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి శర్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండల పరిధది పొడగట్లపల్లి లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శనివారం అంగన్‌వాడీ కార్యకర్త సంకు శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగసత్యవేణి పాల్గొన్నారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ శుభ్రత ప్రతీ ఒక్కరిపై అవగాహన ఉండాలనేది స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దీనిని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అలాగే బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.



మండపేటలో ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ వేగుళ్ల తదితరులు



ఈతకోటలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు



ఆలమూరులో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు


కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కార్టూన్ 'నిజం'



తూర్పులో మండపేట విలీనంపై హర్షం

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం
జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడం పట్ల శనివారం మహిళా సమైక్య అధ్యక్షురాలు మాసవరపు విజయ కుమారి, సిబ్బంది తదితరులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మండల మహిళా సమీక్ష కార్యాలయం వద్ద శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మండపేట నియోజకవర్గ ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శామ్యూల్, క్లస్టర్ సిసి సుబ్బారావు, మండల విఒలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఎఒఐ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్
ఎల్ఐసి ఎఒఐ యూనియన్ 22వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం అమలాపురం ఎల్ఐసి కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎఒఐ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు అయినవిల్లి నాగేంద్ర కుమార్ అధ్యక్షతన జెండా ఆవిష్కరించి కేక్ కటింగ్ చేశారు. ముఖ్యఅతిథిగా రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు వీరభద్రరావు పాల్గొని మాట్లాడుతూ ఎల్ఐసి 2003లో కేరళలో యూనియన్ ప్రారంభమైందని, ఇప్పటికి 22 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఇప్పటికి వరకూ సాధించిన విజయాలను, యూనియన్ గొప్పతనాన్ని భవిష్యత్తులో చేపట్టిపోయే కార్యక్రమాలను వివరించారు. మరో ముఖ్యఅతిథిగా బ్రాంచ్ మేనేజర్ కె.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 22వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎల్ఐసిలో వచ్చిన పెను మార్పులు, ఎల్ఐసి నూతన పథకాలు సాధించిన విజయాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ జి.వినాయకరావు, ట్రెజరర్ డి.శివస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేత వీరస్వామి, సౌత్ సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వై.ఆదినారాయణ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్.లంకేశ్వరుడు, డివిజన్ ఇసి మెంబర్ ఎం.దుర్గా శ్రీనివాస్ గౌడ్, అధికారపు బాబ్జి, మద్ద సత్యనారాయణ, కోరుమిల్లి మధు, బొక్కా వెంకటేశ్వరరావు, మట్టపర్తి ఏసుదాస్, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు


చిత్రలేఖనం పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రామచంద్రపురం
పట్టణంలో విద్యుత్ సంస్థ 'ఎపిఇపిడిసిఎల్' రామచంద్రపురం డివిజన్ పవర్ కన్జర్వేషన్ అవగాహన నిమిత్తం శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రామచంద్రపురం నారాయణ ఒలింపియాడ్ కు చెందిన కె .కార్తిక ప్రథమ స్థానం, ఎస్ .లాస్య, కె.నందిత ద్వితీయ స్థానం పి .పర్ణిక తృతీయ స్థానం సాధించారు. వీరికి రామచంద్రపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మేడిశెట్టి వెంకటరమణ, ఎఎఒ. శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. నారాయణ ప్రిన్సిపల్ పోతంశెట్టిసుభాష్ చంద్రబోస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు విద్యలోనే కాక సాంస్కృతిక, కళారంగాల్లో ప్రతిభ కలిగి ఉన్నారని అన్నారు. విజేతలకు నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అమలాపురం ఎజిఎం శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఎపిఇపిడిసిఎల్ డివిజనల్ సిబ్బంది, నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో విద్యుత్ సంస్థ సిబ్బంది, అధికారులు

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం
విద్యాభివృద్ధికి ఉప్పలగుప్తంకు చెందిన క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ అధినేత మట్టపర్తి ఉమామహేశ్వర సత్యనారాయణ కృషి అభినందనీయమని స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. సత్యనారాయణ విజయవాడలో ఉంటూ చీకట్లపాలెం ఎంపిపి పాఠశాలకు కావలసిన మౌలికసదుపాయాలను కొన్నేళ్లుగా సమకూరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఆ పాఠశాల్లో విద్యార్థుల ఆట స్థలంలో కావల సిన ఆట వస్తువులను సమకూర్చారు. వీటిని ఆ పాఠశాలలో శనివారం స్థానిక సర్పంచ్ చిన్నవరాజు ఎంపిడిఒ డి.కృష్ణ, ఎంఇఒ సత్తి సత్యకృష్ణ, గ్రామ పెద్దల చేతుల మీదుగా ఆటవస్తువులను విద్యార్థులకు అందజేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న ఉమామహేశ్వర సత్యనారాయణను, ఆయన తల్లి అన్నపూర్ణను ఆ పాఠశాలలో సర్పంచ్ చిన్నవరాజు, గ్రామ పెద్దలు సత్కరించారు. అనంతరం గ్రామ పెద్దలను, అధికారులను, ఉపాధ్యాయులను సత్యనారాయణ దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చీకట్ల అబ్బాయి,చిక్కం బాలయ్య,రవణం మధు, సలాది నాగేశ్వరరావు, చీకట్ల రెడ్డి నాయుడు, డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, హెచ్‌ఎం ఎల్.అమ్మాజీ, ఉపాధ్యాయులు ఎం.కాసులమ్మ, ఎన్.దేవి, చిక్కం మైనర్‌బాబు, వై.శ్రీనివాస్, జి.సుబ్రహ్మణ్యం, టి.సీతారాం, శివరాం తదితరులు ఉన్నారు.



పాఠశాలలో దాత సత్యనారాయణకు సత్కారం

నేరాలు ఘోరాలు

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

గత మూడేళ్లుగా కాజులూరు, తాళ్లరేవు, కరప మండలాల్లో మహిళలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచింగ్ ముఠా ఆగడాలకు పోలీసులు చెక్ పెట్టారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు, ఏకంగా 29 నేరాలతో సంబంధం ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.58 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పి బిందుమాధవ్ వివరాలను వెల్లడించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. డిసెంబర్ 19వ తేదీన కోలంక గ్రామ శివారు గోపిపేట వంతెన వద్ద నిఘా పెట్టడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముల్లాడి విజయ్‌కుమార్, పెసింగి రాధాకృష్ణ, ముల్లాడి సతీష్, పారంశెట్టి బుజ్జి వెంకట దుర్గారావును అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ ముఠా ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని మంగళ సూత్రాలను, బంగారు గొలుసులను బైకులపై వేగంగా వచ్చి లాక్కెళ్లేవారన్నారు. అరెస్టయిన వారిలో విజయ్ కుమార్, రాధాకృష్ణలపై అత్యధికంగా 22 నుంచి 25 కేసులు ఉన్నాయని అన్నారు. కాకినాడ జిల్లాతో పాటు కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోనూ ఈ ముఠా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిందని తెలిపారు. ఈ ముఠా నుంచి రూ.56 లక్షల విలువ చేసే 452 గ్రాములు బంగారం, రూ.2 లక్షలు విలువచేసే ఐదు మోటర్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభను కనబరిచిన రూరల్ సిఐ చైతన్య కృష్ణ, ఎస్ఐ మోహన్‌కుమార్, హెచ్‌సి నరసింగరావు, కానిస్టేబుల్ గోవిందరాజులు, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పి అభినందించారు. క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి దొంగలను వేటాడిన సిబ్బందికి రివార్డులను ప్రకటించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

చర్చికి పెయింటింగ్ వేస్తూ ఒక వ్యక్తి కాలుజారి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాకినాడ జగన్నాధపురంకు చెందిన పలివెల సతీష్ ఉప్పాడలోని ఒక చర్చికి పెయింటింగ్‌ను రెండు రోజులుగా వేస్తున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా చర్చి గోడలకు పెయింటింగ్ వేస్తుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో హుటాహుటీన అతనిని స్థానిక పిహెచ్‌సికి తరలించారు. సతీష్ కాలు విరిగిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమిక వైద్యం అనంతరం క్షతగాత్రుడిని కాకినాడకు తరలించారు.

బైకు దొంగకు జైలు శిక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

బైక్ చోరీ నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ కాకినాడ 5వ జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఎస్‌కె షారోని తీర్పు వెలువరించినట్లు సిఐ కృష్ణభగవాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాధపట్నం, వేట్లపాలెం గ్రామానికి చెందిన పిల్లి విజయ్‌కుమార్, వీర వెంకట సత్యనారాయణకు చెందిన బైక్‌లు చోరీ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ కేసులో నిందితుడైన ఖమ్మం జిల్లా అర్వారావుపేటకు చెందిన సారిపల్లి నరసయ్యరాజుకు ఒక నెల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు.



దాతకు స్వామి వారి చిత్రపటం బహూకరిస్తున్న చక్రి

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

ముమ్మిడివరానికి చెందిన రామాయణం శ్రీరామ చిరంజీవి, కుటుంబసభ్యులు అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని శనివారం దర్శించుకున్నారు. స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) స్వామి వారి చిత్రపటం అందజేశారు.

పథకాలు అందేలా చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రతి కుటుంబానికి నూరు శాతం సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ విజెవి.రమణ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లక్ష్మణరావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్ళి కుటుంబ సర్వే చేయాలన్నారు.

యానాం వార్తలు

49 మంది హోంగార్డులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీసుశాఖలో పనిచేస్తున్న 49 మంది హోంగార్డులకుఉద్యోగోన్నతి కల్పిస్తూ పోలీస్ స్పెషల్ ఆఫీసర్ ఆర్.ఎలుమలై ఉత్తర్వులు జారీచేశారు. వీరి విద్యార్హత ధ్రువపత్రాలను ఈ నెల 23న పరిశీలించనున్నట్లు తెలిపారు. యానాం నుంచి దువ్వారపు వి.జానకిరామయ్య, మెల్లం గిరీష్ సుధాకరరావు, కుక్కల దుర్గాప్రసాద్ ఉద్యోగోన్నతి పొందారు.

నేడు పల్స్‌పోలియో కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

యానాంలో నేడు పల్స్‌పోలియో కార్యాక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు వైద్యశాఖ అధికారి టి.రవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలున్న పోలియో చుక్కలు పిల్లలకు వేయించవచ్చున్నారు.

అభివృద్ధి మాట.. హామీల పాట..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటనలు ఆద్యంతం జిల్లా ప్రజలను ఉసూరుమనిపించాయి. ఎప్పటిలానే అభివృద్ధి మాట.. హామీల పాటలతో పర్యటనలు మమ అనిపించారు. మంత్రి నారా లోకేష్ పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్యార్థులతోనూ ముఖాముఖి అయ్యారు. క్రమంతప్పక ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. మరోవైపు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ఇచ్చిన హామీ నీటిమీద రాతలుగా మిగిలిపోయింది. కేవలం ఒకటి లేక రెండు నోటిఫికేషన్‌లు మినహా గడిచిన 18 నెలల్లో నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదు. ఇంకోవైపు నిరుద్యోగ భృతి హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇటువంటి కీలకమైన సమస్యలను పరిష్కరించకపోగా విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలంటూ హితవు పలికారు. ఉద్యోగాల కల్పనకు అకడమిక్స్‌తో పాటు ఇండస్ట్రీని అనుసంధానిస్తామని, కేజీ నుంచి పీజీ వరకు స్త్రీలకు ప్రత్యేక కార్యచరణ, జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ హామీలను గుప్పించటం చర్చనీయాంశమైంది. గత నెలలో నిర్వహించాల్సిన ఈ పర్యటన టిడిపిలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో పలుమార్లు వాయిదా పడింది. సిటీ ఎంఎల్ఎతో పాటు పలువురు ముఖ్యనేతలు మద్యం సిండికేట్‌లకు వెన్నుదన్నులా ఉన్నారనే ఆరోపణలు గత నెలరోజులుగా భగ్గుమంటున్నాయి. దీంతో పాటు రాజానగరంలో టిడిపి, జనసేన నేతల మధ్య ఆరంభం నుంచి లుక లుకలు వెంటాడుతూనే ఉన్నాయి. పలుమార్లు ముఖ్యనేతలు వారించినా ఫలితం లేకపోయింది. తాజాగా లోకేష్ పర్యటన కూడా ఈ ఆదిపత్య పోరుకు వేదికైంది. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో తమకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదంటూ జనసేన ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ఆయన అనుచరులు చేసిన వీరంగం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే విధంగా అమరజీవి జలధార పేరుతో పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకానికి ప్రారంభోత్సవం చేపట్టారు. రెండేళ్లలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే సహించబోమని అధికారులను ఆదేశించారు. ఇటువంటి ప్రకటన హర్షించదగినదే. అయితే పిఠాపురం నియోజకవర్గంలో గత కొంతకాలంగా నెలకొన్న అనిశ్చితిపై కనీసం స్పందించకపోవటం విస్మయానికి గురి చేస్తోంది. పిఠాపురం నియోజక వర్గం, కొత్తపేటలో ఒక క్రైస్తవ మందిరాన్ని, ఆర్ఎస్ఎస్ ఇతర అనుబంధ సంస్థలు లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అధికారులు జోక్యం చేసుకున్నప్పటికీ ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. మరోవైపు గత నెలలోనే ఒక పాఠశాలలో విద్యార్థులపై కుల వివక్ష చూపించారంటూ విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. ఈ సమస్యను పరిష్కరించకపోగా ప్రతిపక్ష వైసిపి విద్యార్థులతో కుల రాజకీయం చేస్తోందంటూ ఉపముఖ్యమంత్రి స్థాయి నేత విమర్శించటం చిత్తశుద్ధి లేమికి దర్పణం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోనే పిఠాపురం నియోజకవర్గం ఓ రోల్ మోడల్ కాబోతోందంటూ ఆశించిన అక్కడి ప్రజలకు గడచిన 18 నెలల్లో ఎటువంటి భరోసా లభించలేదు. అభివృద్ధి జాడే లేదు. మరోవైపు ఎంఎల్ఎలూ అందుబాటులో లేరు. మాజీ ఎంఎల్ఎ వర్మపైనా జనసేన నేతలు సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలతో ఇప్పటికీ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. మొత్తం మీద ఆ నియోజకవర్గం చుక్కాని లేని నావలా తయారయిందనడంలో ఎటువంటి సందేహమూ లేదని సుస్పష్టమవుతోంది.



ప్రదర్శన నిర్వహిస్తున్న కాపవరం గ్రామస్తులు

కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని నిరసన

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని మండలంలోని కాపవరం గ్రామస్తులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నినాదాలు చేశారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఆకాంక్షలు నెరవేరకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్నం సతీష్, మాజీ ఎంపిటిసి సభ్యుడు గీశాల శతకోటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జి.సత్యనారాయణ, గుంటూరు ప్రసాద్, వాసంశెట్టి ఏడుకొండలు, ములగపాటి జోగిరాజు, నరాల వీరభద్రం, గీశాల మహేశ్వరరావు, కాదా శ్రీనివాస్ అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు సంతకాలు సేకరణ లో పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న ప్రజాసంఘాలు

'విబి జి రామ్‌జీని ఉపసంహరించుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేదల పొట్ట కొడుతూ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా తీసుకు వచ్చిన విబి జి రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవన విధానానికి భరోసానిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడుస్తూ, కొత్తగా తీసుకువచ్చిన 'విబి -జి రామ్-జి (వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్) బిల్లును వెంటనే ఉపసంహరించాలన్నారు.ఉ పాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదలు చేశారు. అనంతరం తహశీల్దార్ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన అందోళనలో పార్టీ మండల కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణరావు, ఎన్. వెంకటేష్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనకు టిఎల్ఎం దోహదం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోదించేందుకు టిఎల్ఎం దోహదం చేస్తోందని డిఇఒ పి. నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలోని క్లస్టర్ కాంప్లెక్స్‌ను శనివారం డిఇఒ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన టిఎల్ఎంలను పరిశీలించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించెందు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'ముస్తాబు కార్యక్రమం'లో భాగంగా ముస్తాబు సామాగ్రిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, డిసిఇబి సెక్రెటరి బి.హనుమంతురావు, ఎంఇఒలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక అచ్చంపేటలోని తన నివాసంలో మండలంలోని పనసపాడు గ్రామానికి చెందిన పాలిక జష్మితకు సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన రూ.51,300 చెక్కును ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్, టిడిపి నాయకులు అనుసూరి రాంబాబు, అమలాపురపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ సుధీర్ తదితరులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీలోని స్థానిక ఎస్‌విఫంక్షన్ హాలు నందు శనివారం ట్రూత్ కాన్ఫనెన్స్ టీమ్, మంజీరా సూపర్ స్పెషాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంజీరా ఆసుపత్రి అధినేత డాక్టర్ సుధీర్ పాల్గొని మాట్లాడుతూ క్రిస్మస్‌ను కుటుంబ సమేతంగా జరుపుకోవడం ఐక్యతకు చిహ్నమన్నారు. డాక్టర్ మంజీరా జ్యోతి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణల సమ్మిళతమే క్రిస్మస్ వేడుక అని అన్నారు. అనంతరం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రేమ్ చంద్ సారథ్యంలో కేక్ కట్‌చేసి, క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టరు జిల్లా ఫెలోషిప్ సెక్రటరీ యెహోషువ, శామ్యూల్ జ్యోతి, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం సహకార సొసైటీ సభ్యుడు మాకే వెంకన్న బాబు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయనకు సహకార సొసైటీలో ఇన్సూరెన్స్ పాలసీ ఉంది. ఈ కారణంగా వెంకన్న బాబుకు రూ.50 వేలు బీమా సొమ్ము మంజూరు అయ్యింది. శనివారం సొసైటీ కార్యాలయంలో వెంకన్న బాబుకు మంజూరైన రూ.50 వేల చెక్కును సొసైటీ ఛైర్మన్ చిక్కం ఉమేష్ అందజేశారు. కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ పిఎఆర్ఎన్.శర్మ, బ్యాంకు సూపర్‌వైజర్ ఎం.నరేష్, సిఇఒ ఆకుల సూర్యప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిపిఒ శాంతా లక్ష్మి సూచించారు. నగరంరలో శనివారం సర్పంచ్ జాలెం రమణకుమారి అధ్యక్షతన జరిగిన నాసా ప్రోగ్రాంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని 150 పంచాయతీలకు గాను 90 శాతం పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉందన్నారు. మిగిలిన పంచాయతీల్లో కూడా పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పి బొజ్జిరాజు, డిప్యూటీ ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విధానాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక విధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపిడిఒ జి.భవానీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో విఆఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ టెక్నాలజీపై శనివారం శిక్షణా కార్యక్రమ నిర్వహించారు. విధులతో పాటు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని విఆర్‌ఒల వినతి

ప్రజాశక్తి -గోకవరం

పని ఒత్తిడి నుంచి వెసులుబాటు కల్పించాలని విఆర్‌ఒలు స్థానిక డిప్యూటీ తహశీల్దారుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో తమ విధుల కారణంగా పని ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేల్లో తమకు మినహాయింపు ఇవ్వాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధార్ ఆప్షన్‌తో వేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని కోరారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌కెబిఆర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బారావు అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ సీఐ వీరబాబు మాట్లాడుతూ అరచేతిలో ఇముడుతున్న సెల్ ఫోన్ వినియోగంలో మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలన్నారు. పిడి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణంలో భావిభారత పౌరులుగా నేటి విద్యార్థుల పాత్ర గణనీయమైనదన్నారు. సైబర్ నేరాల టెక్నీషియన్ ఫణీంద్ర పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ వెంకటపతి రాజు, మెండు బాలాజీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు రోటరీ క్లబ్, ఆకొండి ట్రస్ట్ అమలాపురం వారు సంయుక్తంగా 11 మంది విద్యార్థులకు యూనిఫామ్‌ను బహూకరించారని ప్రిన్సిపాల్ డా వి నరసింహస్వామి శనివారం తెలిపారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వరదా మల్లేశ్వరరావు, అధ్యక్షులు ఆర్‌డిఎస్ ప్రసాద్, సెక్రెటరీ ఆకొండి పవన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్, ఆకొండి ట్రస్ట్ అమలాపురం వారికి ప్రిన్సిపల్ నరసింహస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కరుణశ్రీ, డాక్టర్ బాలస్వామి, డాక్టర్ ఆశిష్ బాబు, శైలజ, త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మంత్రి సుభాష్ సూచించారు. రామచంద్రపురంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొని ప్రసంగించారు.. గత హాస్టల్ బిల్డింగ్‌లో ఉన్న విద్యార్థినుల అవస్థలు చూసి పట్టణంలోని ఒక ప్రయివేటు బిల్డింగ్‌కు విద్యార్థులను తరలించి సహాయం చేసిన మంత్రికి విద్యార్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంఇఒలు వీర రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, గొల్లపల్లి కష్ణ, ప్రిన్సిపల్ జె శైలజ, వైస్ ప్రిన్సిపల్ రేణుక దేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గురుకుల పాఠశాల అభివృద్ధికి హామీ ఇచ్చిన మంత్రి సుభాష్ ను సిబ్బంది, విద్యార్థుల సత్కరించారు.

చెత్తకు ఉచితంగా కూరగాయల పంపిణీ

- పరిసర ప్రాంతాల ప్రజల నుంచి అనూహ్య స్పందన
- ద్వారకామయి ఇండస్ట్రీ ఆధ్వర్యంలో కూరగాయల పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం

చెత్తకు కూరగాయల ఉచిత పంపిణీ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోనక్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డిగూడెంలోని 17వ వార్డులోని జై వాసవి స్టీల్ ఎదురుగా ద్వారకామయి ఇండస్ట్రీ ఆధ్వర్యంలో పెన్మత్స సునీత సౌజన్యంతో చెత్తకు బదులు కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం మున్సిపాలిటీ అధికారులు హాజరయ్యారు. కాలుష్యకారకమైన ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు అంతా పాటుపడాలని అధికారులు సూచించారు. స్వచ్ఛమున్సిపాలిటీ కోసం అంతా బాధ్యతగా చెత్తను రీసైకిలింగ్ కోసం అంతా కృషి చేయాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందకు తడి-పొడి చెత్తకు కూరగాల పంపిణీ చేస్తున్న ద్వారకామయి ఇండస్ట్రీ వారి ప్రయత్నం అభినందనీయమని అన్నారు. పొడిచెత్తకు సంబంధించి ఖాళీ వాటర్ బాటిల్స్, డ్రింక్ బాటిల్స్ తదితర కేజీ ప్లాస్టిక్‌వస్తువులకు ఒక కిలో ఆలుగడ్డలు లేదా ఉల్లిపాయలు అందించారు. అలాగే ఖాళీ వాటర్ ప్యాకెట్స్, పాల ప్యాకెట్స్, పాలిథిన్ బ్యాగ్స్, వాటర్ గ్లాసులు, న్యూస్ పేపర్లు, పాత పుస్తకాలు, పాత ప్లాస్టిక్ కవర్లు తదితర అక కిలో పాత వస్తువులకు అరకిలో ఆలుగడ్డలు అందించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నంఉచి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు చెత్తను తీసుకువచ్చి బదులుగా కూరగాయలను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పెన్మత్స సత్యనారాయణరాజును పలువురు అభినందించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా తనవంతు స్వచ్ఛ అమలాపురం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ఒ.మంగాదేవి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.కుమార స్వామి, మెప్మా సిఒ, మెప్మా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కూరగాయలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

లబ్ధిదారులకు గ్యాస్‌స్టౌవ్‌ల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

పిఎం ఉజ్వల యోజన పథకంలో భాగంగా శనివారం పినపళ్లలో లబ్ధిదారులకు గ్యాస్‌స్టౌవ్, సిలిండర్ రెగ్యులేటర్ తదితర సామగ్రి, బాండ్లనున వెంకట సూర్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీస్ వారు 22 మందికి పంపిణీ చేశారు. సర్పంచ్ సంగీత సుభాష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు గ్యాస్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సూర్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ అధినేత ఈదల చినబాబు మాట్లాడుతూ ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ సహా అవసరమైన సామగ్రి అందజేస్తామన్నారు. లబ్ధిదారులు ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ ఎఎంసి ఛైర్మన్ వి.లక్ష్మణరావు, కార్యదర్శి కె.పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న రైతు బజార్లో వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ప్రారంభానికి ముందు రైతు బజారులో తూనికలు, కొలతలు పరిశీలించారు. ఈ సదస్సులో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ మాట్లాడుతూ తూనికలు కొలతలు విషయంలో యజమానులు విధి విధానాలు పాటించాలన్నారు. తూనికలలో మోసం జరిగితే కేసు నమోదు చేస్తామన్నారు. డిసిపిసి సభ్యుడు, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ రైతు బజార్లో నాణ్యమైన కూరగాయలు అమ్మాలన్నారు. తూనికల్లో తేడాలు జరగరాదన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘ కార్యదర్శి ఎం.భాస్కరరావు, సభ్యులు కె.సుధాకర్, సిహెచ్‌వి.చౌదరి, టి.సత్యనారాయణ, వి.శ్యామల, కెవిపి. లక్ష్మి, రైతు బజార్ కార్యదర్శి శ్రీనివాస్, వినియోగదారులు పాల్గొన్నారు.